
ప్రజాశక్తి
శనివారం 3 జూన్ 2023
5
విజయనగరం



ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ ఉపకారవేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) ఫలితాలు విడుదలైనట్లు పరీక్షల నిర్వహణ సంచాలకులు దేవనందరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిఇఒ కార్యాలయంలో గాని, ప్రభుత్వ పరీక్షల సంచాలకుల వెబ్‌సైట్ www.bse.ap.gov.in లో గాని ఫలితాలు చూడవచ్చునని తెలిపారు. ఎంపికైన విద్యార్థుల మెరిట్ కార్డులు త్వరలో సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపుతామని తెలిపారు. జాతీయ విద్యామంత్రిత్వ శాఖ నియమాల ప్రకారం ఎంపికైన విద్యార్థులు వెంటనే ఏదైనా జాతీయ బ్యాంక్‌లో విద్యార్థి పేరున సేవింగ్స్ అకౌంటు తీసుకుని, తండ్రి లేదా తల్లిని జాయింట్ చేసుకోవాలని తెలిపారు. విద్యార్థి ఆధార్ నెంబరును మాత్రమే అకౌంటుకు జతపరచాలన్నారు. విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ మెరిట్ కార్డులో ఉన్న విధంగానే ఆధార్ కార్డ్ లోనూ, బ్యాంకు పాస్ బుక్ లోనూ ఒక్క అక్షరం కూడా తేడా లేకుండా ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

కోట్లలో నీటి వ్యాపారం

అడుగంటుతున్న భూగర్భ జలాలు

అనుమతుల్లేకుండా..


పుట్టగొడుగుల్లా వాటర్‌ప్లాంట్లు

ఒకప్పుడు ప్రకృతి వనరు ఉచిత వస్తువు. ప్రకృతి వనరైన తాగునీరు నేడు ఖరీదైన వస్తువుగా మారింది. మినరల్ వాటర్ పేరుతో నగరంలో అక్రమంగా వెలిసిన నీటి ప్లాంట్లు కోట్లలో వ్యాపారం చేస్తున్నాయి. ఇలా నగరంలో వందకు పైగా అక్రమ వాటర్‌ప్లాంట్లు ఉన్నాయి.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల నగరంలో పుట్టగొడగుల్లా అక్రమ వాటర్‌ప్లాంట్‌లు వెలిస్తున్నాయి. నగరంలో సుమారు వందకు పైగా వాటర్‌ప్లాంట్‌లు ఉన్నాయి. ఒక్క తోటపాలెం, ప్రదీప్ నగర్ ప్రాంతంలోనే ఆరు వరకు ప్లాంట్‌లు ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్ధం చేసువాల్సిందే. జనావాసాల మధ్య వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయ కూడదని ప్రభుత్వ నిబంధన. ఒక వేళ ఎవరైనా అధికారులను మభ్య పెట్టి, లేదా రాజకీయ పలుకబడితో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే అది అక్రమమే అవుతుంది. వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన వారు 5హెచ్‌పి లేదా ఆ పైన మోటారు వాడుతున్నారు. 500 అడుగులు ఆపైన లోతులో బోరు తవ్వి నీటిని అమ్ముతున్నారు. దీంతో 500 అడుగుల లోపు ఉన్న మోటార్లన్నీ వేసవిలో ఎండిపోతున్నాయి. ఈనేపథ్యంలో జన నివాసాలలో రూ.50లక్షలు కట్టుకున్న ప్లాట్లలో ఉందామంటే నీరులేక, అద్దెకి ఎవ్వరూ తీసుకోక యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అనుమతులు లేకుండానే అధికార పార్టీ అండతో ప్లాంట్లు ఏర్పాటు చేస్తూ కోట్లాది రూపాయల నీటి వ్యాపారం చేస్తున్నారు. ఫలితంగా ప్రజలు నీరులేక నానా ఇబ్బందులూ పడుతున్నారు. విజయనగరంలో కేవలం 3 వాటర్ ప్లాంట్‌లకు మాత్రమే అనుమతి ఉంది. అక్రమ వాటర్ ప్లాంట్‌ల వల్ల నీరులేక ఇబ్బందుల పాలైన ప్రాంతాల ప్రజల గోడు ప్రభుత్వానికి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు పట్టడం లేదు.



అయ్యప్పనగర్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న వాటర్‌ప్లాంట్

మరోవైపు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఈ మధ్య తరగతి ప్రజలకు ఇంటి కుళాయిలు ఇస్తామని చెప్పడం తప్ప వేసిన దాఖలాలు లేవు. అపార్ట్ మెంట్ వారికైతే ఇంటి కుళాయి కనెక్షన్లు ఇవ్వక పోవడంతో ప్రతి నీటి బొట్టును కొనుక్కోవాల్సి వస్తుంది.

పట్టించుకోని అధికారులు

ఐదేళ్ల కిందట తోటపాలెంలోను, 2 ఏళ్ల క్రితం కామాక్షి నగర్ లో కాళికా మాతా ఆలయం వద్ద అక్రమ వాటర్ ప్లాంట్‌లను రద్దు చేయాలని ప్రజలు, పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పోరాడారు, నేడు అయ్యప్ప నగర్ స్వామీ లేఅవుట్‌లో అక్రమ వాటర్ ప్లాంట్ అనుమతులు రద్దు చేయాలని పోరాడుతున్నారు. కెఎల్‌పురంలో కంది రాంబాబు ఇంటికి పక్కనే ఒక వాటర్ ప్లాంట్ ఉంది. దీంతో శ్రీనివాసం అపార్ట్ మెంట్లు, కెఎల్ పురం రెవిన్యూ కాలనీలో బోర్లు ఎండి పోతున్నాయి. తోటపాలెంలోని వైఎస్ఆర్ కాలనీలో కుళాయిలు వేయకపోవడంతో అక్కడి ప్రజలంతా చుట్టుపక్కల వాటర్‌ప్లాంట్లపై ఆధారపడుతున్నారు. ప్రస్తుతం ఎస్ విఎస్‌నగర్‌లో వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉన్న వాటర్ ప్లాంట్ ఫలితంగా ఎంఎస్ఎన్ కాలనీ, పిఎస్ఆర్ కాలనీతో పాటూ ఆ చుట్టూ ఉన్న ఇళ్ళల్లో బోర్లు ఇంకిపోయి ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరు తెప్పించుకునే పరిస్థితి నెలకొంది. ఇలా పుట్ట గొడుగుల్లా అక్రమ వాటర్ ప్లాంట్‌లు నగరమంతా జనా వాసాల మధ్య ఏర్పాటు చేస్తుంటే మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, జలవనరుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

అక్రమ వాటర్ ప్లాంట్లను తక్షణమే సీజ్ చెయ్యాలి



నగరంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా వాటర్ ప్లాంట్ లు నిర్వహిస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి పట్టణ ప్రజలకు తీవ్ర నీటిఎద్దడిని ఎదుర్కొంటున్నారు. అయినా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, జలవనరుల శాఖ అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నేతలే ఈ అక్ర మార్కులకు అండగా ఉన్నారని ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికీ కామాక్షీ నగర్లోని అక్రమ వాటర్ ప్లాంట్ పోరాడి సీజ్ చేయించాం. ఇప్పుడు అయ్యప్ప నగర్‌లో పోరాడుతున్నాం. ఇలా ప్రజలు పోరాడి అక్రమ వాటర్ ప్లాంట్‌ల రద్దు చేయించుకోవాలి.

- రెడ్డి శంకరరావు, విజయనగరం పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి

అయ్యప్పనగర్‌లో ప్లాంట్‌ను రద్దుచేయాలి



నగరంలోని అయ్యప్పనగర్‌లో వాటర్ ప్లాంట్ అక్రమంగా నిర్వహిస్తున్నారు. వేరొకరు రెడ్డి రామారావు అనే వ్యక్తి మా కాలనీలో బోరు తీసి ట్రాక్టర్, ట్యాంకర్లతో రోజు రాత్రి 10 తరువాత, ఉదయం 5 గంటల వరకు నీటిని తరలిస్తున్నారు. వాటర్‌ప్లాంట్ నిర్వహణకు వినియోగించే బోరు 500అడుగుల లోతున తీయడంతో చుట్టుపక్కల ఇళ్లల్లో బోర్లు ఎండిపోతున్నాయి. రూ.50లక్షలు పెట్టి ఇళ్లు కట్టుకుంటే నీరు లేక నానా ఇబ్బందులూ పడుతున్నారు. ఈ విషయమై అధికారులు స్పందించి ప్లాంట్‌ను మూయించాలి.

-యుఎస్ రవి కుమార్, అయ్యప్ప నగర్ పోరాట కమిటీ నాయకులు



తల్లికి బిడ్డే లోకం. బిడ్డ కంట్లో నీళ్లు కనపడితే.. తల్లి మనసు తల్లడిల్లిపోతుంది. బిడ్డకు ఏ చిన్న బాధ కలగకుండా కంటికి రెప్పలా కాచుకుంటుంది. అందుకే ఈ సృష్టిలో అమ్మ స్థానం అన్నింటికన్నా గొప్పది. అలాంటి ఓ తల్లి.. ఏకంగా బిడ్డను వక్రమార్గంలోకి నెట్టాలని చూసింది. కాదంటే.. చిత్రహింసలు పెట్టింది. అమ్మతనానికే మాయనిమచ్చ తెచ్చే ఈ అమానుష ఘటన విజయనగరంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి..

కన్నబిడ్డపై తల్లి కర్కశం

- వ్యభిచారం చేయాలని బాలికపై ఒత్తిడి
- వ్యతిరేకించిందని చిత్రహింసలు
- స్పందించిన బాలల సంక్షేమ సమితి
- విశాఖలోని సంరక్షణ గృహానికి తరలింపు

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం జిల్లా కేంద్రం తోటపాలెం సమీపంలో ఓ వివాహిత.. పదో తరగతి చదువుతున్న కుమార్తె(16)తో కలసి నివాసం ఉంటోంది. భర్త గతంలోనే ఆమెను వదిలి వెళ్లిపోయాడు. దీంతో రెండో పెళ్లి చేసుకుంది. కొద్ది రోజుల తర్వాత అతను చనిపోయాడు. ప్రస్తుతం మరో వ్యక్తితో సహజీవనం చేస్తోంది. మరికొంత మందితో కూడా ఆమెకు వివాహేతర సంబంధాలున్నట్లు స్థానికుల ద్వారా తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. తన కుమార్తెను కూడా పలువురి వద్దకు వెళ్లాలని కొన్నాళ్లుగా ఆమె బలవంతం చేస్తోంది. తనకు అటువంటి పని ఇష్టం లేదని కుమార్తె ఎంత నచ్చజెప్పినా వినలేదు. చిత్రహింసలు పెట్టేది. నిద్రమాత్రలు ఇచ్చేది. నయానోభయానో తన దారికి తెచ్చుకునేందుకు శతవిధాలా ప్రయత్నించింది. ఫలానా వారి వద్దకు వెళ్తే సినిమాలో అవకాశాలిప్పిస్తారని.. మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రలోభపెట్టింది. తల్లి పెడుతున్న చిత్రహింసలు భరించలేక ఆ బాలిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. వారి నుంచి స్పందన లేకపోవడంతో, తెలిసిన వారి ద్వారా మీడియాను ఆశ్రయించింది. వెంటనే వారు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచనలతో బాలల సంక్షేమ సమితి సభ్యులు అక్కడకు చేరుకుని.. బాలికను ఆ చెర నుంచి తప్పించారు. తొలుత విజయనగరంలోని స్వధార్ హోమ్‌కు తరలించారు. అక్కడ బాలల సంక్షేమ సమితి సభ్యులు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం విశాఖలోని సంరక్షణ గృహానికి తరలించాలని ఆదేశించారు. దీంతో చైల్డులైన్, బాలల సంరక్షణ సిబ్బంది బాలికను విశాఖకు తరలించారు.

బాలలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

ఈ ఘటనపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావును సంప్రదించగా.. తల్లిదండ్రులు పిల్లల పట్ల ఇంత క్రూరంగా వ్యవహరించరాదన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాలలు ఎక్కడ్కెనా ఈ తరహా ఇబ్బందులకు గురైతే, ధైర్యంగా సమీపంలోని బాలలతో పని చేస్తున్న సంస్థలను సంప్రదించి రక్షణ పొందాలని సూచించారు. వారికి అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

డిమాండ్ ఉన్న పంటలనే ప్రోత్సహించండి

వ్యవసాయ శాఖ కమిషనర్ అరుణ్ కుమార్

ప్రజాశక్తి-విజయనగరం



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ కమిషనర్ అరుణ్

సాధారణ ప్రజానీకం ఎక్కువగా ఎలాంటి ఆహార పదార్థాలను వినియోగిస్తారో, ప్రజా మార్కెట్లో వేటికి ఎక్కువగా డిమాండ్ ఉంటుందో అలాంటి ఆహార పంటలనే పండించేలా రైతులను ప్రోత్సహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ అరుణ్ కుమార్ జిల్లా అధికారులకు సూచించారు. రైతులు పండించిన అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర లభించేలా సహాయ, సహకారాలు అందించాలని చెప్పారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్లో జిల్లా అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పంటల సాగు, విత్తనాల సరఫరా, ధాన్యం కొనుగోలు, బిల్లుల చెల్లింపు, భీమా పరిహారాల అందజేత తదితర అంశాలపై చర్చించారు. గత సీజన్ నుంచి ఇప్పటి వరకు వ్యవసాయ శాఖ, ప్రజా పంపిణీ వ్యవస్థలో జరిగిన పరిణామాల గురించి, తీసుకున్న చర్యల గురించి జెసి మయూర్ అశోక్ వివరించారు. గత సీజన్‌లో జరిగిన ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి రవాణా భత్యం చెల్లింపులపై కమిషనర్ ఈ సందర్భంగా ఆరా తీశారు. త్వరితగతిన సంబంధిత బిల్లులను చెల్లించేయాలని సివిల్ సప్లయి డిఎంను ఆదేశించారు. ఎండియు వాహన చోదకులకు ప్రమాద భీమా వర్తించేలా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే రిజిస్టర్ అయ్యి ఎవరైనా మృత్యువాత పడి ఉంటే వివరాలు పంపించాలని డిఎస్ఒకు సూచించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్ళేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిరుధాన్యాల సాగుకు తగిన ప్రోత్సాహం అందించాలని, మేలు రకం విత్తనాలను సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా వ్యవసాయ అధికారి రామారావు, డిఎస్ఒ మధుసూధన్ రావు, సహకార అధికారి రమేష్ పాల్గొన్నారు.

రైతును బలోపేతం చేయడమే లక్ష్యం

యంత్రసేవా మెగామేళాలో రూ.15.2 కోట్ల విలువైన యంత్రాలు పంపిణీ ● జెండా ఊపి ట్రాక్టర్లను ప్రారంభించిన మంత్రి బొత్స

ప్రజాశక్తి-విజయనగరం

రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు కోట కూడలి లో శుక్రవారం యంత్ర సేవా పథకం రెండవ విడతకింద రైతులకు యంత్ర పరికరాలను అందజేసే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి గా విచ్చేసిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ యంత్ర పరికరాల పంపిణీ లో ప్రభుత్వం గ్రూప్‌కు 40 శాతం సబ్సిడీని, 50శాతం బ్యాంకు ఋణంగా అందజేస్తుందని,గ్రూప్ సభ్యులు 10 శాతం మాత్రమే చెల్లిస్తే సరిపోతుందని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా తక్కువకే బహిరంగ మార్కెట్ లో దొరికితే రైతు తీసుకోవచ్చుని స్పష్టం చేసారు. దళారీ , అవినీతి లేకుండా నేరుగా లబ్దిదారునికి చేరాలని, లబ్దిదారుకు మేలుజరగాలని భావించి తక్కువ ధరకే ప్రభుత్వం యంత్ర పరికరాలను అందిస్తోందని అన్నారు. గత ఏడాది మొదటి విడత యంత్ర పరికరాల పంపిణీలో 310 గ్రూప్ లకు , 28.45 కోట్ల రూపాయల విలువైన పరికరాలను అందజేశామని, ఇందులో 9.34కోట్ల ను సబ్సిడీ గా అందజేశామని తెలిపారు. నేడు 2వ విడత లో 184 సిహెచ్‌సిలకు 505 రకాల యంత్ర పరికరాలను అందజేశారు. మొత్తం యంత్ర పరికరాల విలువ 15.20 కోట్లు కాగా ఇందులో సబ్సిడీ రూపంలో రూ.4.54 కోట్లు అందించామని మంత్రి పేర్కొన్నారు. ఈసందర్భంగా మంత్రి జెండా ఊపి ట్రాక్టర్లను ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన మెగా చెక్కును లబ్ది దారులకు అందజేశారు.




రైతులకు ట్రాక్టర్ నమూనా కీని అందిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు మాట్లాడుతూ ఒక్కో రైతు భరోసా కేంద్రానికి 15లక్షల విలువైన యంత్ర పరికరాలను అందజేస్తున్నామని తెలిపారు. రైతులకు విత్తనం నుండి విక్రయం వరకు ఆర్‌బికెల ద్వారానే జరుగుతోందని తెలిపారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగలో ప్రభుత్వం అనేక విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిందని , దీనివలన వ్యవసాయ సాగు సుళువు గా అవుతుందని అన్నారు. యంత్ర పరికరాల ధరలను పారదర్శకంగా ఆర్.బి.కె లలో ప్రదర్శించి, రైతులకు తక్కువ ధరలకే అందిస్తామని తెలిపారు. విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, ఈ ఏడాది 40 శాతం వరకు ఆర్.బి.కె ల ద్వారానే పంపిణీ చేస్తామని అన్నారు. త్వరలో డ్రోన్‌ల ద్వారా పురుగుమందులు స్ప్రే చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, డిసి ఎం ఎస్ ఛైర్‌పర్సన్ భావన, డిసిసిబి చైర్మన్ చిన్న రామునాయుడు, సహాయ కలెక్టర్ త్రివినాగ్, జిల్లా వ్యవసాయ అధికారి వి.టిరామారావు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిఎంహెచ్‌ఒగా భాస్కరరావు

ప్రజాశక్తి-విజయనగరం



బాధ్యతలు స్వీకరిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ ఎస్.భాస్కర రావు నియమితులయ్యారు. ప్రస్తుత డిఎం హెచ్ఒ ఎస్‌వి రమణ కుమారి ఉద్యోగ విరమణ చేయడంతో భాస్కర రావును డిఎం హెచ్‌ఒగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన విశాఖలోని ఆంధ్ర మెడికల్ కళాశాలలో సివిల్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.

జిల్లా సహాయ ఆడిట్ అధికారిగా ప్రభావతి



సహాయ ఆడిట్ అధికారి ప్రభావతి

జిల్లా సహాయ అడిట్ అధికారిగా సిహెచ్ ప్రభావతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె శ్రీకాకుళం జిల్లా పరిషత్ విభాగంలో పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

హామీలు నెరవేర్చాలని ఉద్యోగుల దీక్ష

ప్రజాశక్తి-గజపతినగరం

ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని ఎపిజిఇఎ మండల అధ్యక్షులు బి.సుధాకర్ పట్నాయక్, కార్యదర్శి ఎస్‌కె బాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపిజిఇఎ ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని జిల్లా అధ్యక్షులు పి.రామచంద్రరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని, ఎప్పటికప్పుడు డిఎ ఇస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి నాలుగేళ్లయిన హామీ నెరవేర్చలేదన్నారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చేస్తున్న జాప్యానికి నిరసనగా ఒక రోజు రిలేహారదీక్షలు చేస్తున్నామని తెలిపారు. సిపిఎస్ రద్దు కోసం న్యాయపోరాటానికైనా సిద్ధమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



దీక్షలో పాల్గొన్న ఉద్యోగులు, యూనియన్ నాయకులు

దీక్షలకు ఎన్‌జిఒ పూర్వపు అధ్యక్షులు రాజగోపాల్ దాస్, సంఘం నాయకులు గోవిందరాజు, పింఛనుదారుల సంఘం మండల అధ్యక్షులు సుబ్రమణ్యం, కార్యదర్శి సత్యం, సిఐటియు జిల్లా నాయకులు వి.లక్ష్మి, తదితరులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు బి.సింహాచలం, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరామకృష్ణ, కోశాధికారి సామంతుల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు జి.జనార్ధనరావు, ఎం.రాఘవనాయుడు, సంయుక్త కార్యదర్శులు సుధారాణి, శంకరరావు దొర, పాపారావు, సత్యవతి, పాల్గొన్నారు.

మైనింగ్ ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కుమిలి రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు-1లో కొండను ఆనుకొని మైనింగ్‌కు అనుమతులు ఇచ్చిన ప్రాంతాన్ని శుక్రవారం రెవెన్యూ, అటవీ, మైనింగ్ శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. గ్రావెల్ తవ్వకాలకు సర్వే నంబర్ 1లో రెవెన్యూ అధికారులు గతంలో అనుమతులు ఇచ్చారు. అయితే ఇటీవల మైనింగ్ చేస్తున్న ప్రాంతం తమదంటూ ఫారెస్ట్ అధికారులు పనులను నిలిపేశారు. దీనిపై సంబంధిత మైనింగ్ చేస్తున్న యజమానులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే చేసి తమకు ఇచ్చిన అనుమతులు ప్రకారం హద్దులు చూపించాలని కోరారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తహశీల్దార్ ఇమంది భాస్కరరావు, ఫారెస్టు రేంజర్ పి.అప్పలరాజు, సర్వే ఇన్‌స్పెక్టర్ జనేశ్వరరావు, సెటిల్మెంటు అధికారి కె.వెంకటరమణ, రాయిల్టీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ పీటర్‌తో కూడిన బందం మైనింగ్‌కు అనుమతులు ఇచ్చిన ప్రాంతాన్ని పరిశీలించారు. కుమిలి కొండ సర్వే నెంబరు 1లో 428.70 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, దానిలో కొంత మేర నిబంధనల మేరకు మైనింగుకు ప్రభుత్వం నుండి అనుమతులు ఇచ్చారన్నారు.



కుమిలిలో మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సిరుగుడు గోవిందరావు పేరిట 6.25 ఎకరాలు, దల్లి గౌతమరెడ్డి పేరిట 17.5 ఎకరాల్లో మైనింగ్‌కు అనుమతులు ఇచ్చారు. అనుమతులు ఇచ్చిన ప్రాంతాన్ని దాటి ఫారెస్టుశాఖకు చెందిన భూముల్లో కొంత మేర తవ్వకాలు జరుగుతున్నట్లు ఫారెస్ట్ అధికారులు ఆరోపిస్తున్నారు. దీనిపై తహశీల్దార్ భాస్కరరావు స్పందిస్తూ మైనింగు జరుగుతున్న భూములు రెవెన్యూకి సంబంధించినవని, ఫారెస్టు అధికారులు ఎటువంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. గజిట్లో ఫారెస్టు భూములుగా ఉన్నప్పటికీ మైనింగ్ జరుగుతున్న ప్రాంతం రెవిన్యూదేనిని తెలిపారు. అయితే పూర్తిస్థాయి సర్వే చేయడం ప్రస్తుతం కష్టమేనని చెప్పారు. ఫారెస్ట్ ఇచ్చిన భూములకు సంబంధించి సరిహద్దులు కొండ మధ్య ప్రాంతంలో ఉన్నాయని, వాటిని ఇప్పుడు కనుగొనడం కష్టంగా మారిందని తెలిపారు. త్వరలోనే ఆ హద్దులను తేల్చేందుకు పూర్తిస్థాయి సర్వే నిర్వహిస్తామన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ స్థానంలో నిలవాలి

జెడ్‌పి సిఇఒ అశోక్ కుమార్

ప్రజాశక్తి-విజయనగరం



మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ అశోక్ కుమార్

స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాల నిర్వహణలో అందరూ భాగస్వాములై జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేయాలని జిల్లా పరిషత్ సిఇఒ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం, జిల్లా తాగునీటి పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ పీర్ కమిటీ శిక్షణా కార్యక్రమం శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ గ్రామాల్లో భాగమైన మిషన్ లైఫ్ కార్యక్రమంపై క్షేత్రస్థాయి నుండి అవగాహన కల్పిస్తూ కార్యక్రమంలో వివరాలను ఆన్‌లైన్ చేయాలని కోరారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బి.ఉమాశంకర్ మాట్లాడుతూ శిక్షణ అనంతరం పీర్ కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ సమాచారాన్ని స్వచ్ఛ సర్వేక్షన్ పోర్టల్ లో అప్‌లోడ్ చేయాలని అన్నారు. డిపిఒ శ్రీధర్ రాజా మాట్లాడుతూ గ్రామ స్థాయిలో స్వచ్ఛభారత్ కార్యక్రమాల నిర్వహణలో పంచాయతీ కార్యదర్శి పాత్ర అత్యంత కీలకమైనదని అన్నారు. కార్యక్రమంలో డిఇఇ కోటేశ్వరరావు, డి డబ్ల్యుఎస్‌సి కన్సల్టెంట్లు టి.సుధాకర్, రమేష్ శ్రీలక్ష్మి, డిపిఎంయు సిబ్బంది, ఇఒపిఆర్‌డిలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సత్య కళాశాల విద్యార్థికి కాంస్య పతకం

ప్రజాశక్తి-విజయనగరం



పతకంతో మణికంఠ

ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జరుగుతున్న ఖేల్ ఇండియా యూనివర్శిటీ గేమ్స్‌లో స్థానిక సత్య డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి ఎం.మణికంఠ వెయిట్ లిఫ్టింగ్ 89 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించాడు. 130 కేజీల స్నాచ్, 154 కేజీల క్లీన్, జర్క్‌లో కాంస్య పతకాన్ని సాధించాడని కోచ్ చల్లా రాము తెలిపారు. ఈ సందర్భంగా మణికంఠను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మీ, కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం. శశి భూషణ రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవమణి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మహేష్, అధ్యాపకులు అభినందించారు. భవిష్యత్తులో మణికంఠ వెయిట్ లిఫ్టింగ్ లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

నేడు హౌసింగ్ డే

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ మండలంలోని కొండగంగుపూడి గ్రామంలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.



శిక్షణలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఇఒ లింగేశ్వరరెడ్డి

12నాటికి ఉపాధ్యాయ బదిలీలు పూర్తి

డిఇఒ లింగేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-బొబ్బిలి

జిల్లాలో ఈ నెల 12 నాటికి ఉపాధ్యాయ బదిలీలు పూర్తి చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వరరెడ్డి చెప్పారు. ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉపాధ్యాయ శిక్షణను పరిశీలించిన ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలను డిస్ప్లే చేసి, పారదర్శకంగా బదిలీలు చేస్తామన్నారు. జగనన్న విద్యాదీవెన కిట్లు ఇప్పటికి 62శాతం వచ్చాయని, 12 నాటికి పూర్తి స్థాయిలో వస్తాయన్నారు. జిల్లాలో 737 పాఠశాలలకు నాడు-నేడు రెండో విడత పనులకు రూ.230 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. ఇప్పటికి రూ.76కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ నెల 12లోగా నాడు-నేడు రెండో విడత పనుల్లో విద్యుత్తు, మరుగుదొడ్లు, వంట గదులు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. నాణ్యమైన విద్యను అందించేందుకు పర్యవేక్షణ పెంచుతామని చెప్పారు.

విద్యార్థుల స్థాయిని గుర్తించి బోధించాలి

విద్యార్థుల స్థాయిని గుర్తించి బోధించాలని జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వరరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008, 2018, 1998 డిఎస్‌సి ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆంగ్లంలో విద్యార్థులు మాట్లాడేలా బోధన చేయాలన్నారు. తెలుగులో ఉన్న నీతి కథలను బొమ్మలతో ఎలా బోధించాలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ ఎన్.తిరుపతినాయుడు, ఎంఇఒ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని మొయిద విజయరాంపురంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శుక్రవారం ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గుర్ల మండలం కెల్ల గ్రామానికి చెందిన కెల్ల పాపయ్యమ్మ, నెల్లిమర్ల మండలం కొండవెలగాడకు చెందిన బూటి సూరిబాబు, మొయిద గ్రామానికి చెందిన శినగం దమయంతి వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం సహాయనిధి చెక్కులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, డిసిసిబి వైస్ చైర్మన్ చనుమల్ల వెంకటరమణ, వైసిపి సీనియర్ నాయకులు కెవి సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

బొండపల్లి తహశీల్దార్‌గా ప్రసాదరావు

ప్రజాశక్తి-బొండపల్లి

బొండపల్లి మండల తహశీల్దార్‌గా డిఎంజిఎన్ ప్రసాదరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తవలస మండలానికి బదిలీపై వెళ్లిన శ్రీనివాస్ మిశ్రా.. ప్రసాదరావుకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఎంపిపి చలంనాయుడును ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం తహశీల్దార్ ప్రసాదరావు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో వాలంటీర్ల సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని 25, 26, 27, 28 వార్డులలో పని చేస్తున్న వార్డు వాలంటీర్లను శుక్రవారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను ఇంటింటికి అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎం.తిరుపతిరావు, పి.ఉమాశంకర్, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్ పాల్గొన్నారు.



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యాన శుక్రవారం గురజాడకేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తెలుగు, ఇంగ్లీషు భాషల్లో నిర్వహించిన ఈ పోటీలకు సుమారు 250 మంది పిల్లలు హాజరయ్యారు. గెలుపొందిన వారికి ఈనెల 5న ఉదయం 9.30గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయం ఆడిటోరియంలో జరుగనున్న పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ చేతులమీదుగా బహుమతులు అందజేస్తారని కాలుష్య నియంత్రణమండలి ఇంజినీర్ టి.సుదర్శనం తెలిపారు.

పట్టణ సఖీ కమిటీ సమావేశం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో పట్టణ సఖీ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ సముద్రపు రామారావు మాట్లాడుతూ బాలికలకు విద్య, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గుడ్, బ్యాడ్ టచ్‌లు, వేధింపులు, పౌష్టికాహారం, యుక్త వయసులో ఉన్న వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో నాయకులు మద్దిల వాసు, పాండ్రంకి సత్యనారాయణ, తుమ్ము నారాయణమూర్తి పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులకు పింఛన్లు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలో సతివాడలో ఇద్దరు కిడ్నీ బాధితులకు సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపిటిసి రెడ్డి సత్యనారాయణ శుక్రవారం పింఛన్లు రూ.10 వేలు చొప్పున అందజేశారు. చందక తౌడు, అదపాక కంచయ్య మూడు నెలల నుంచి కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు చందక త్రినాథ, గేదెల రమణ, చందక బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఎండ తీవ్రతతో ఉపాధి కూలీలు విలవిల

- మండుటెండలో కానరాని వసతులు
- పట్టించుకోని యంత్రాంగం



రేవళ్లపాలెంలో మండుటెండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఉపాధి హామీలో పనిచేసే కూలీలకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వేసవి నేపథ్యంలో ఉదయం ఎనిమిది గంటలకే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్న విషయం విదితమే. మండుటెండలో ఉపాధి కూలీలు పనిచేయాల్సిన పరిస్థితి. ఎండదెబ్బ తగిలి అస్వస్థతకు గురైన సంఘటనలు కోకొల్లలు. ఉపాధి పనులు చేసే చోట కూలీలకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమే ఈ దుస్థితికి కారణమని తెలుస్తోంది. వేసవి ఎండ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పనిచేసే చోట టెంట్లు, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు లేవని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శృంగవరపుకోట మండలంలోని 26 పంచాయతీలలో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్నారు. మండలంలో 13,500 మందికి జాబ్ కార్డులు ఉండగా, రోజుకు 9500 మంది వరకు ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. ఉపాధి హామీ పనులను శుక్రవారం 'ప్రజాశక్తి' పరిశీలించగా, కూలీలు పడుతున్న పలు ఇబ్బందులు వెలుగులోకి వచ్చాయి. 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతల మధ్య టెంట్లు కూడా లేని పరిస్థితులలో కూలీలు పనిచేసేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వారికి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు ఎక్కడా కనిపించలేదు. పనులు జరుగుతున్న చోట టెంట్లు, తాగునీటి వసతులు కూడా ఏర్పాటు చేయలేదు. ఇంటి నుంచి తెచ్చుకున్న నీరే తాగుతున్నామని కూలీలు ప్రజాశక్తి ఎదుట వాపోయారు. ఇక మజ్జిగ, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు వంటి సౌకర్యాల జాడ కానరాలేదు.

ప్రభుత్వం సరఫరా చేయలేదు



గతంలో ఇచ్చిన టెంట్లు చిరిగిపోయాయి. బాగున్న టెంట్లు కొన్నిచోట్ల వినియోగిస్తున్నారు. కొత్తవి సరఫరా కావాలంటే కమిషనరేట్ సూచనల మేరకు జిల్లాలో టెండర్లు వేయాలి. ప్రథమ చికిత్స కిట్లలో మందులు గడువుతేది ముగియడం వల్ల తిరిగి పంపించేశాం. పనిచేసే చోట కూలీలకు దాతలు మంచినీరు, మజ్జిగ వంటివి పంపిణీ చేస్తే కొంత ఉపశమనం కలుగుతుంది.

- తిరుపతి, ఎపిఒ, శృంగవరపుకోట



భానుడి ప్రతాపానికి ఉపాధి పనులు చేస్తున్న పరిసరాల్లో చెట్టు నీడన చేరిన ఉపాధి కూలీలు

కొట్టాం వంతెనపై ఆందోళన

హైవే నిర్మాణ పనుల నుంచి బ్రిడ్జిని కాపాడాలని డిమాండ్

ప్రజాశక్తి - జామి

హైవే నిర్మాణ పనుల కోసం భారీ వాహనాలు తిరగడంతో జామి - కొట్టాం వంతెన దెబ్బతింటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం బ్రిడ్జి వద్ద ఆందోళన చేపట్టారు. జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బండారు పెదబాబు, మాజీ సర్పంచ్ ఇప్పాక వెంకట త్రివేణి ఆధ్వర్యాన గ్రామస్తులు వంతెనపై బైఠాయించారు. హైవే నిర్మాణ పనులతో బ్రిడ్జి పూర్తిగా దెబ్బతిందన్నారు. రహదారి దెబ్బతింటే, మరమ్మతులు చేసే అవకాశాలు ఉన్నాయని, కానీ వంతెన కూలిపోతే ఏవిధంగా బ్రిడ్జిని కాపాడుకోగలమని ఆవేదన వ్యక్తం చేశారు. గోస్తనీ నది అవతల పదుల సంఖ్యలో గ్రామాలు ఉన్నాయని, వాటితోపాటు మండల కేంద్రమైన జామి రైతుల అవసరాలకు వంతెన ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, వంతెనను కాపాడాలని కోరారు. ఎస్.కోట సిఐ సింహాద్రినాయుడు, ఎస్ఐలు వీరబాబు, తారకేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు.



వంతెనపై ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు, స్థానికులు

కార్యక్రమంలో టిడిపి నాయకులు, స్థానిక పెద్దలు, రైతులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బి ఇఇకి వినతి

హైవే పనులతో దెబ్బతిన్న కొట్టాం వంతెనను బాగుచేయాలని విజయనగరంలో ఆర్అండ్‌బి ఇఇని వైసిపి మండల కన్వీనర్ జి.రవికుమార్, విజినిగిరి సర్పంచ్ కిలారి సూర్యారావు, బ్యూటిఫికేషన్ చైర్మన్ సిహెచ్ సత్యారావు వినతి పత్రం అందజేశారు.

రీసర్వేతో ప్రభుత్వ భూముల లెక్కలు తేల్చాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేతో ప్రభుత్వ, అటవీ భూముల లెక్కలు తేల్చాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నగర పంచాయతీ, మండలంలో గత కొన్నేళ్లుగా ప్రభుత్వ, అటవీ భూములు అన్యాక్రాంతమై ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయన్నారు. నగర పంచాయతీలో చంద్రబాబునగర్ కాలనీ, పాత తహశీల్దారు కార్యాలయం, శ్రీరాం నగర్ కాలనీ, తెలకలివీధిలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు చెప్పారు. పూడమ్మ వనం వద్ద గుర్తించిన ప్రభుత్వ భూమి రైతుల నుంచి కొంతమంది ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిందని తెలిపారు. అటవీ భూములను కూడా ఆక్రమించుకొని కట్టడాలు చేపట్టారని తెలిపారు. రీసర్వేలో వాటి లెక్కలు తేల్చాలని డిమాండ్ చేశారు. నగర పంచాయతీలో 1400 మందికి ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేసినా, స్థలాలు చూపించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రీసర్వేలో ద్వారా ప్రభుత్వ భుముల లెక్కలు తేల్చి, 1400 పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని రామారావు డిమాండ్ చేశారు.

ఘనంగా ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఆటోస్టాండ్‌ను ప్రారంభిస్తున్న నాయకులు జగన్మోహనరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఏర్పాటై 50ఏళ్లయిన సందర్భంగా ఆవిర్భావ దినోత్సవాన్ని సిఐటియు ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గుంకలాం జగనన్న కాలనీలో శుక్రవారం సిఐటియు అనుబంధ ఆటోస్టాండ్‌ను ఏర్పాటు చేశారు. ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఎ.జగన్మోహన్‌రావు సిఐటియు జెండా ఎగురవేశారు. నగర కార్యదర్శి బి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ 1 నుంచి 2024 మే 31 వరకు స్వర్ణోత్సవాల్లో భాగంగా పతాక ఆవిష్కరణలతో పాటు డ్రైవర్ల భద్రత, సంక్షేమం కోసం సదస్సులు, చర్చాగోష్టులు, రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, డ్రైవర్లంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సరుకు, ప్రజారవాణా ద్వారా వేల కోట్ల రూపాయలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయాన్ని సమకూర్చుతున్న డ్రైవర్లు, రవాణా రంగా కార్మికులకు భద్రత లేదన్నారు. తిండి, నిద్ర, విశ్రాంతి లేకుండా సేవలందిస్తున్న డ్రైవర్లకు తగిన గుర్తింపు లేదని, ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపెట్టుకునేందుకు ప్రమాదాలు జరిగితే డ్రైవర్లను బాధ్యులను చేస్తున్నారని, తాగుబోతులుగా ముద్ర వేస్తున్నారని అన్నారు. డ్రైవర్ల భద్రత కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు నారాయణప్పడు , తిరుపతి, అప్పలనాయుడు, తిరునాదు, సతీషు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల పక్షపాతి టిడిపి

నియోజకవర్గ నాయకులు గొంప క్రిష్ణ

ప్రజాశక్తి-వేపాడ

టిడిపి హయాంలో మహిళాభ్యుదయానికి పెద్దపీట వేశామని, మహిళా పక్షపాతిగా పార్టీ నిలిచిందని ఆ పార్టీ నియోజకవర్గ యువనేత గొంప క్రిష్ణ తెలిపారు. వేపాడ మండలంలో శుక్రవారం ప్రయివేటు కార్యక్రమానికి హాజరైన ఆయన స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలో మహిళలకు అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. దీంతో అధికార పార్టీలో గుబులు మొదలైందని చెప్పారు. గతంలోనూ మహిళల కోసం అనేక పథకాలు, కార్యక్రమాలకు మాజీ సిఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి, మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేసింది కూడా ఆయనేనని వెల్లడించారు.


అనంతరం తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, బానాది ఎంపిటిసి సభ్యులు గొంప తులసి మాట్లాడారు. తొలిసారి మహిళా సంఘాలను ఏర్పాటుచేసి, వారికి రుణాలిచ్చి, తమ కాళ్లపై నిలబడేలా చేసిన మాజీ సిఎం చంద్రబాబునాయుడు మహిళా పక్షపాతి అన్నారు. మహిళలకు పసుపు-కుంకుమ నిధులు మంజూరు చేయడం, గ్యాస్ స్టవ్‌లు పంపిణీ చేయడం, ఇళ్ల పట్టాలు జారీ చేయడంతో చంద్రబాబు ప్రత్యేక స్థానం పొందారన్నారు. ప్రస్తుత సిఎం జగన్మోహన్ రెడ్డి మాయమాటలు చెప్పి గద్దెనెక్కి, ప్రజాధనాన్ని దోచుకోవడమే పనిగా ముందుకు సాగుతున్నారని విమర్శించారు. చంద్రబాబునాయుడును మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు సేనాపతి గణేష్, మంచిన అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత

ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పి.సురేశ్‌బాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని చంద్రంపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా గ్రామంలో పర్యటించి, సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని తెలిపారు. పథకాలు కావాలంటే ఎంతో కొంత పైకం చెల్లిస్తే గాని అందించేవారు కాదన్నారు. ప్రస్తుతం పార్టీలు, కుల, మతాలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలా మాటలు చెప్పడం కాదని, చేతల ప్రభుత్వమని సిఎం జగన్మోహన్ రెడ్డి చేసి చూపించారని తెలిపారు. మరోసారి వైసిపికి మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ళ సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీరాములు నాయుడు డిసిసిబి వైస్ చైర్మన్ చనమల్ల వెంకట రమణ, కో ఆప్షన్ సభ్యులు, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠం నాయుడు, పతివాడ సత్యనారాయణ, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, తుమ్మలపేట పిఎసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడినాయుడు, మాజీ సర్పంచ్ కర్రోతు వెంకట రమణ, ఎంపిడిఒ జి.గిరి బాల, తహశీల్దార్ కె.వి.రమణ రాజు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్‌పి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

కొత్తవలస : మూడేళ్ల కాలంలో ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే పార్టీ విజయానికి శ్రీరామరక్షని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం దేశపాత్రునిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఈ మూడేళ్ల కాలంలో అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రభుత్వం వచ్చాక కలిగే మేలును వివరించారు.వైసిపి ప్రభుత్వాన్ని పెద్దమనసుతో దీవించాలని కోరారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, జెసిఎస్ ఇంచార్జిలు బొంతుల వెంకటరావు, పిఎస్ఎన్ పాత్రుడు, నారాయణ, సర్పంచ్ దలాయి అప్పరాజు, లక్ష్మీ, ఎంపిటిసి కోరుబిల్లి లక్ష్మి, బొడ్డు అప్పారావు, ఏడువాక నారాయణ, వైసిపి మండల యువజన విభాగం అధ్యక్షుడు ఐతంశెట్టి అనిల్, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

సిరిమానోత్సవానికి పక్కాగా ఏర్పాట్లు

ప్రజాశక్తి-రామభద్రపురం

తారాపురంలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో జరిగే గ్రామదేవత సిరిమానోత్సవ వేడుకలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని బొబ్బిలి రూరల్ సిఐ తిరుమలరావు.. కమిటీ సభ్యులకు సూచించారు. ఎస్ఐ సురేంద్ర నాయుడుతో కలిసి శుక్రవారం తారాపురం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిరిమాను, అంజలిరథం, అమ్మవారి ఘటాలు తిరిగే ప్రాంతాలు పరిశీలించి, సూచనలిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి అపరిచితులు వస్తారని, అప్రమత్తంగా ఉంటూ దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ఉత్సవాన్ని చీకటి పడక ముందే ముగించేలా ఉత్సవ కమిటీ చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామం మీదుగా జాతీయ రహదారి ఉన్నందున ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు, వేగ నిరోధకాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఐ తిరుమలరావు

వైసిపి పాలనలో అరాచకాలే

మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వైసిపి పాలనలో అరాచకాలు తప్ప అభివృద్ధి లేదని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని కొట్టాం, రేవళ్లపాలెం గ్రామాల్లో టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్.నాయుడు ఏర్పాటు సమావేశంలో ఆమె మాట్లాడారు. నాలుగేళ్ల వైసిపి పాలనలో చేసింది శూన్యమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, మాజీ సర్పంచ్ గొర్లె నారాయణమూర్తి, రెడ్డి అప్పలసత్తి తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని నీలకంఠరాజపురం, చినగుడిపాల గ్రామాల్లో కార్యకర్తలతో టిడిపి రాష్ట్ర నాయకులు కెబిఎ రాంప్రసాద్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. సమావేశంలో టిడిపి నాయకులు పోతల వెంకటరమణ, కొట్యాడ రమణమూర్తి, కోళ్ల వెంకటరమణ, లాలం అర్జునరావు, పి.వెంకట రత్నాజీ, దాసరి లక్ష్మి, వి.జగ్గుబాబు పాల్గొన్నారు.

ఘనంగా ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పినతాడివాడలో రామాలయ ప్రతిష్టలో భాగంగా శుక్రవారం రాములవారి విగ్రహాలను పల్లకిలో ఘనంగా ఊరేగించారు. ముందుగా విగ్రహాలకు ఉదయం విఘ్నేశ్వరపూజ చేశారు. అనంతరం సుందరకాండ పారాయణం, సూర్య నమస్కారాలు, మూలమంత్ర హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. తప్పెటగుళ్లు, కోలాటం, చెక్కభజన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. భారీ మందుగుండు సామగ్రి కాల్చారు. నూతనంగా నిర్మించిన రామాలయం వద్దకు తీసుకెళ్లారు. పలువురు యాత్రికులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామాలయ ఉత్సవ కమిటీతోపాటు పలువురు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



విగ్రహాలను ఊరేగిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు